# మైదానంకాదు...

స్విచ్ ఆఫ్ చేసి నెమ్మదిగా రగ్గుని కప్పుకుని పడుకున్నాను. వీధిగదిలో పడకకుర్చీమీద కూర్చుని శర్మ పేపరు చదువుతున్నాడు. కొంచెంగా కళ్ళు మూతబడ్డాయి.

ఎవరోవచ్చి మంచంమీద కూచుని, మెల్లగా నా చెయ్యిల్ని తడిమి పట్టుకున్నారు. తర్వాత వక్షోజాలు మెత్తగా నా గుండెల్ని తాకినట్టయింది. నిశ్వాసం మెల్లగా విడుస్తున్నట్టుకూడా వినబడింది. వెంటనే ముసుగుతీశాను. లేవబోయాను.

పెద్ద జడేదో నామీద పడింది. జుట్టులోంచి కమ్మని వాసనలు వెలువడుతున్నాయి. ఎవరో యవ్వనంలోని స్త్రీలా వుంది. ఇరవై ఏళ్లుంటాయి.

"ఎవరు?" అన్నాను ఏం అర్థంకాక. వీధిగదిలో శర్మ చదువుతూనేవున్నాడు.

"నేనా... వేణ్ణి!"

తిన్నగా కూచుని అంది కృష్ణవేణీ - శర్మభార్య. అతిథిగా వెళ్లినందువల్ల ఆ వేళ తప్పితే ఆమెని యిదివరకెప్పుడూ చూళ్లేదు. "ఏమిటా దారుణం?"

అదే పైకి అన్నాను.

"ఏదో ఋణం. ఆ ఋణం తీర్చించుకుందామనే వొచ్చాను."

సన్నని వేలితో బుగ్గ మీద మీటబోయింది. నేను వెనక్కు తగ్గాను.

"పాలు కారవులేవోయ్" అంది వయ్యారంగా కూనిరాగం తీస్తూ. నావైపు కొంచెం జరిగింది. నేను పూర్తిగా రగ్గుతీసి ఓమూలకు యిరికాను.

మా మాటలు విని శర్మ ఏమన్నా కదులుతాడేమో అంటే అది లేదు. అతను గమనించనట్లు వూరుకున్నాడు.

"మొగవాళ్ళలో కూడా పతివ్రతలు వుంటారన్నమాట! తాకితే నీ బంగారం అంటు కుంటుందా ?"

నాకు ఒళ్లుమండింది. ఏమిటీ సంసార వ్యభిచారం! మానవ నాగరికతలో ఒక నీతి, నియమం వుండొద్దూ?

"నీ వుద్దేశ్యం నాకు తెలిసిందికాని, పొరబడుతున్నావు. నేను వ్యభిచారాన్ని ప్రోత్సహించే మూర్ఖుణ్ణికాదు. ఆడవాళ్ల చేతుల్లో ఆటవస్తువుని కాదు. అదుగో నీ భర్త. అక్కడికి వెళ్లు" అన్నాను.

"నా ప్రియ సారంగధరా..." అని గెడ్డం పట్టుకోబోయింది. వీధిగదిలోని దీపంనుంచి వొచ్చే గుడ్డి వెలుతురులో ఏదో కాదు పిశాచంలా కనబడింది.

"షటప్–" అని చేతినీ, మనిషినీ తోసిపుచ్చాను.

వొగరుస్తూ లేచి నించుంది.

"ఇందాకటి నుంచి ఏదో ఎప్పుడన్నా నాటకంలో సారంగధర వేషం వేశారనుకున్నాను. ఛీ! మూర్ఖుడా! కోరి వచ్చిన ఆడదాన్ని అనుభవించడం చేతకాని అమాయకుడా! నీ యింతోటి అందాన్ని మోహించి వచ్చాననుకున్నావా! ఛో" అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయింది.

శర్మ యింకా వీధిగదిలో పేపరు చదువుతూనే వున్నాడు. నా బెడ్డింగ్ సర్దుకుని నేను కదిలాను. అతను అడ్డలేదు.

అంతా కళ్లకి కట్టినట్టయింది. ఆవేళ... ఆస్థితిలో చూసిన కృష్ణవేణ్ణి ఈవేళ యీస్థితిలో చూసాను.

ఏదో వింత కేసొచ్చిందని రమ్మనమని డాక్టరు మూర్తిగారు కబురుచేస్తే వచ్చాను.

కృష్ణవేణి జబ్బుల్తో ముఖమంతా నల్లబడి, జీర్ణావస్థలో పడుకుని వుంది. నన్ను చూసి చేతులు జోడించి, కూచోమని సంజ్ఞచేసింది.

పక్కని స్టూలుమీద కూర్చున్నాను. మనిషి పాలిపోయి అస్థిపంజరమయింది. చేతులూ, వేళ్లూ, ముఖం, ఎముకలు తప్ప వేరేం కనబడ్డంలేదు.

డాక్టరు మూర్తిగారు అన్నారు "ఆవిడే మిమ్మల్ని పిలిపించమని అడిగింది. మీతో ఏదో మాట్లాడాలట."

నాకు ఆశ్చర్యమేసింది. ఆరేళ్లక్రిందట జరిగిన ఆ సంఘటనలు తప్ప నాకూ, ఆమెకూ వేరు పరిచయం లేదు. ఏం చెపుతుంది నాతో?

ఆలోచనలో వున్న నా మీద ఎముకల్లాంటి వేళ్లుపడి స్పృహకలిగించాయి.

"నన్ను క్షమించవూ" అంది. కళ్లలో నీళ్లునిండాయి.

నెమ్మదిగా వేళ్లు నిమిరాను.

"శర్మ ఎక్కడ ?" అన్నాను.

"ఏమీ తెలియదు. రెండేళ్ళ క్రితం నన్ను ఒంటరిగా విడిచి ఎక్కడికోపోయారు. మళ్లీ జాడ తెలీలేదు". నీరసమైన గొంతుకతో అంది.

అసలు ఎందుకు వచ్చిందీ దురవస్థ ?" జాలితో అన్నాను.

నర్సు ఏదో మందు త్రాగించిందామెచేత.

కృష్ణవేణి గొంతుకు ఓ పొడిదగ్గు దగ్గి సర్దుకుంది. నుదుటిమీద వేలితో రాసి చూపించింది. కళ్లు లోతుగా పోయాయి. రెప్పలు నల్లబడ్డాయి.

"అట్టే శ్రమ నియ్యకండి ఆవిడకీ" అన్నారు డాక్టరు మూర్తి.

"అబ్బే! శ్రమలేదు. చెబుతానుండండి" అంది కృష్ణవేణి.

కొంచెం వూపిరి తీసుకుంటూ, తలగడ చేతికిందపెట్టుకుని, దానిమీద ఆనుకుని మా ప్రక్కకి తిరిగింది.

నేను ముఖపరిశీలన చెయ్యసాగాను.

ఆవిడ చెప్పింది.

"అసలు ఆడవాళ్ల ప్రకృతే వేరు. మానసికంగా, శారీరకంగా. అది తెల్సుకుని ఆడవాళ్లు గాని, మగవాళ్లుగాని సరిగా ప్రవర్తించనపుడు యిట్లాగే జరుగుతుంది. రైలు యింజను పట్టాలనుతప్పితే సరిచెయ్యొచ్చును. కాని, కాలుజారిన ఆడది మళ్లీ ఆ అడుగుతియ్యలేదు. ఆ జీవితం యింక అంతే! అదీ నా అనుభవం. నా కథ విన్నాక నన్నూ నిందించరు, మీరు నా భర్తనీ నిందించరు. మనం నివసించే దుర్భర సమాజ పరిస్థితుల్నీ, పరిస్థితుల్ని మార్చుకోవడం తెలీని మనచేతకానితనాన్ని నిందించుకోవాలంతే!"

"మీకు తెలుసు యీవేళ ప్రపంచం ఎంత దుర్భిక్షంతో మండిపోతోందో! సామాన్య మానవుడు ఏదోగతిలేక బతుకుతున్నాడు. కాని జీవచ్ఛవంలా, జీవించడానికికాదు, జీవితాన్ని ఆనందించడానికి కాదు. చావలేక – నిజం అంతే!"

"అదే మా కుటుంబాన్ని కూల్చింది. అసలే ఉద్యోగాలకి, అభివృద్ధికీ ఎవరో దేవుళ్ళుండాలి. అలాంటిది రెండోయుద్ధం లోకానికి వేరే రోగం తెచ్చిపెట్టింది. అది అధికార మదాంధత – దానికితోడు కామాంధత!"

"అప్పుడు మిలటరీలో పనిచేసేవారు ఆయన. మేం ఎక్కడో బారక్సులో ఓ మూల సామాన్య కుటుంబంగా వుండేవాళ్ళం. ఎన్నేళ్లు పనిచేసినా ఈయన ఉద్యోగంలో ఎదుగు కనపడలేదు. తక్కిన వాళ్లు పెద్దపెద్ద జీతాలు పొంది అభివృద్ధి చెందసాగారు. నాకు ఏదీ అర్థంకాలేదు. ఎందుకని? ఆయనకు తెలివితేటలు లేకా? ఆయన్ని ఒకసారి అడిగాను. తల భూమిలోకి దించుకుపోయినట్టు అయి, ఆయన అన్నారు – "వాళ్లు వాళ్ల భార్యల్ని..." నాకు అర్థమయింది. "బాబోయ్!" అరిచాను. కళ్లు తిరిగాయి.

కొన్నిరోజులు దొర్లిపోయాయి. ఆ చెడ్డమాట మరిచిపోయి సూటిగా మళ్లీ బ్రతకలిగాను.

ఒకరోజు సాయంత్రం ఆయన కారులో వచ్చారు. "త్వరగా బట్టలు వేసుకో" అన్నారు.

"ఏం?" అన్నాను.

"సినిమాకి పోదాం."

"ఏం కారుకూడా దొరికిందే ఈవేళ?"

"అంతా వుందిలే" అని నన్ను తొందరచేశారు. నేను నిజమనుకుని నమ్మాను. బయలుదేరాను.

"కారు ఓ యింటిముందు ఆగింది. ఆయన దిగకుండా "ఆ జవానుతో వెళ్లు" అన్నారు. నా గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. నే "వెళ్లను" అన్నాను. "నువ్వుకూడా నన్ను చంపు" మనం జీవితంలో యింకెప్పుడూ సుఖించవద్దూ" ఆయన ప్రార్థించి. కళ్లనీళ్లు తెచ్చుకున్నారు. ఏం చెయ్యను...?"

"ఆ విదేశీయుడి చేతుల్లో మసైన నా శరీరాన్ని మళ్లీ ఆ కారే మా యింటికి చేర్చింది. నేను నాలుగురోజులు లేవలేదు. ఆయన హోటల్లో భోజనంచేసి ఆఫీసుకి వెళ్లివస్తూవుండేవారు. కొన్నాళ్లలో ఆయనకి వేరే పెద్దవుద్యోగం అయింది. మా జీవితం బాగుపడింది అనుకున్నాము. తక్కినవాళ్లలాగే, కళ్లుమూసుకుని, సుఖంగా బతకొచ్చుననుకున్నాం."

"కాని ఆ ఆఫీసరు బదిలీకావడం, కొత్తవుద్యోగి యీయన్ని కిందకి దించడం ఒకేసారి జరిగాయి. అప్పుడు మాకు కలిగిన విచారానికి మేరలేదు. కాని కొత్తవుద్యోగి కూడా అదేమోస్తరవడంవల్ల నీచానికి మళ్లీ వొడబడ్డాం.

"ఈసారి ఆయనికి టూరింగ్ ఉద్యోగం దొరికింది. పది పదిహేను రోజులు వూళ్లో వుండేవారుకారు. ఒకసారి వరుసగా రెండు నెల్లుండిపోయారు. అప్పుడు నేను ఒంటరితనాన్ని భరించలేకపోయాను. అప్పటికే ముగ్గురు మనుష్యులు మారిన నాకు సిగ్గనేది పోయింది. మా యింటిప్రక్కనున్న బ్రహ్మచారి నాకర్షించి ఆ రెండు నెల్లూ గడిపాను."

"తర్వాత భర్తవున్నా అంతే, మా యింటికి వొచ్చిన అతిథులు నా అతిథ్యం స్వీకరించని వారెవరూలేరు – మీరు తప్ప. మొదట ఆయన చచ్చేలా పోరారు. కాని అప్పట్లో నన్నెవ్వరూ ఆపలేకపోదురు. అంతకీ కాదంటే ఆయన్నించి విడిపోడానికి కూడా సిద్ధమయ్యాను. అందుకనే ఆయన పెదవి కదపలేదు."

"ఒకసారి ఎవరో మిత్రుడువస్తే ఆయన వొద్దన్నా – రచ్చకీడ్వవద్దన్నా – సినిమాలకీ – వాటికీ తిరిగాను, ఆయనతో హోటల్లో కొన్నిరోజులు గడిపాను. వారం అయ్యాక యింటికివస్తే ఆయన లేరు. ఆయన జాడ యిప్పటికీ తెలీలేదు."

"ఉన్న నగలూ, సామానులూ అమ్మి యిన్నాళ్లు బ్రతికాను. నాలుగు రోజుల్నుంచి ఓ టాంగావాడు..." చిరునవ్వు నవ్వి పమిట తీసింది. వక్షంనిండా కొరుకులు, రక్కులు... మళ్లీ వెంటనే కప్పుకుంది.

"చలంగారి మైదానం చదివావా?"

"లేదు ఏం ?"

"ఏంలేదు. అది మైదానం – కాని యిది పట్నవాసం! మైదానంకాదు..." అంది వొగురుస్తూ వెనక్కుతిరిగి పడుకుంది.

పెద్ద దగ్గుతెర వచ్చి ఐదునిమిషాలు ముంచెత్తింది. కళ్లతో నన్ను చూస్తూ వెళతానన్నట్టు సంజ్ఞచేసింది. తర్వాత జోడించిన చేతులు అట్లాగేవున్నాయి. కళ్లు ముయ్యబడలేదు.

"ఎలాగా బ్రతకదు. కాని యిప్పుడు మనశ్శాంతి లభించి సుఖంగా పోయుంటాయి ఆమె ప్రాణాలు" అన్నారు డాక్టరు మూర్తి గుడ్డని ముఖంమీద కప్పుతూ బరువుగా మొహంపెట్టి.

నేను లేచి చేతులు జోడించాను. ప్రతి నమస్కారంచేస్తూ కంటినుండి రెండు నీటి చుక్కలు నేలమీద పడ్డాయి.

"నా కథ విన్నాక నన్ను నిందించరు. మీరు నా భర్తనీ నిందించరు. మనం నివసించే దుర్భర సమాజపరిస్థితుల్నీ, పరిస్థితులు మార్చుకోలేని మన చేతకానితనాన్ని నిందించుకోవాలంతే..." ఆవిడ చెప్పిన మాటలు చెవిలో ప్రతిధ్వనించసాగాయి.

*07.03.1951–ఆంధ్ర సచిత్రవారపత్రిక*